# అర్థంకాని మనుషులు

ఉత్తరం వచ్చింది. గౌతమి రాసింది. అంత పెద్ద నగరంలో ఒక చిన్న అద్దెకొంప ఇంకా సంపాదించలేకపోయారా. ఇంతేనా మీ ప్రయోజకత్వం అంటూ హెచ్చరించినట్లు ధ్వని ఉంది ప్రతీవాక్యంలో.

సిగ్నల్ ఇవ్వక ఔటర్‌లో ఆగిపోయిన ఎక్స్‌ప్రెస్ కసిగా కూత పెట్టినట్లుంది. నగర మధ్యంలోనో, నా ఆఫీసుకు దగ్గరగానో ఇల్లుండాలన్న పట్టుదల సడలించి నగరం పొలిమేరల్లో నాకు దొరికిన పాత పెంకుటింటి తాళాలు అందుకుని ఒక ఆదివారం సైకిల్‌మీద బయలుదేరాను. ఇది సుమారు ఇరవై ఏళ్ల పైమాట.

కాగితం మీద నేను రాసుకున్న కొండగుర్తులు చూసుకుంటూ మురాద్‌నగర్ వెనకాల రోడ్డు మీంచిపోయి చిన్న ప్రహరీగోడల మధ్య ఉన్న పెంకుటింటి తలుపు తెరిచాను. నా వెనక ఏదో నీడలా కదలినట్లనిపించింది. వెనక్కి తిరిగాను.

నల్లని ఛాయ ఆ నలుపులో నేరేడు పండు మెరుపు. ముప్పయి దాటని వయసు. కళ్లలో ఒక వెలుగు. "దొరా! గీడ కిరాయి కొచ్చినవ్వులే?" అంది నేనటు చూడగానే.

అప్పటికి నాకు నగరమే కొత్త. ఆ పొలిమేరల్లోని ప్రాంతం సరికొత్త. 'దొరా' అని అచ్చ తెనుగులో మర్యాదచేసిన పిలుపు, దాని వెనకనే ఏక వచన ప్రయోగం. ఈ తీరు అలవాటుకాక నాకు వింతగా తోచింది. అయితే ఆ మాటల్లో ఉన్న అమాయకత్వం, నమ్రతా నన్ను ఆకట్టుకున్నాయి.

"దొరసాని ఎప్పుడొస్తది?" అడిగింది.

"ఇల్లు బాగుంటే ఉత్తరం వేసినాక" అన్నాను.

"గీడ ఎవులొచ్చినా నేను బాసన్లు తోమి ఇంటిపని చేస్తుంటి"

"నీ పేరు?" నా ప్రశ్న.

"నా పేరు ఎల్లమ్మ. నా తాన జాడుకట్ట ఉంది. నే తీసుకొస్త. రేపు పైసలిస్తే కొత్తది తెస్త' ' అంటూ క్షణంలో మాయమైపోయింది.

అలా ఆ ఇంట్లో అడుగుపెట్టాను. తూర్పు ముఖంగా ఉంది పెంకుటిల్లు. ప్రవేశిస్తూ ఉంటే నా కుడిచేతివేపొక గది, ఎడమ చేతివేపొక గది. రెండూ విశాలమైనవే. వెనుకభాగంలో ఒక వంట గది, కాస్త ఖాళీస్థలం, ఒక బావి.

ఎల్లమ్మ ఇల్లు ఊడ్చి, బూజులు దులిపి గచ్చు కడిగిన తర్వాత తెరచిన కిటికీల్లోంచి ధారాళంగా వచ్చిన గాలీ, వెలుగులతో నా మనసులోని సందేహాలు మాయమై ధైర్యం కలిగింది. ఆకలి కలవరపెడుతూ ఉంటే సిటీలోకి పోయి హోటల్‌లో భోజనంచేసి నాకున్న కేంప్ కాట్, పెట్టే, పరుపూ, కూజా, బకెట్టూ రిక్షాలో పడేసి, సైకిల్ మీద దారిచూపిస్తూ ఎండలో తిరిగి ఇల్లు చేరుకున్నాను. భుక్తాయాసంతో మంచం వేసుకొని దక్షిణం వేపు గదిలో పడుకున్నాను. ఎప్పుడు సెలవు పెట్టాలి, శ్రీమతిని తీసుకురావాలి అని ఆలోచిస్తూ మగత నిద్రలోకి జారుకున్నాను.

కొంతసేపట్లో కిటికీలోంచి ఎండ వేడి లావాలాగా కరిగి నా గదిలోకీ, నా మొహంమీదికీ ప్రవహించింది గదంతా సెగలు గక్కుతోంది. లేచి కాసిన్ని మంచినీళ్లు తాగి ఉత్తర దిశగా ఉన్న గదిలోకి పోయి చూశాను.

చల్లగా ఎ.సి రూములా తోచింది. నా మంచం ఆ గదిలోకి మార్చి పడక వేశాను. పడ్డదే పాటు. సాయంత్రం చీకట్లు ముసిరే వేళ నిద్ర లేచాను.

ఒక మగ గొంతు ఏదో దరువు వేసుకుని పాడుతున్నట్లు వినిపిస్తోంది. "ఏమే పిల్లా మామా బిడ్డా... నిన్నెవ్వ లేమన్నాలె చెప్పే పిల్లా" అన్న పల్లవి శ్రావ్యంగా, స్పష్టంగా వినిపిస్తోంది. కొంతసేపటికి మాటలు స్పష్టత కోలుపోయి ముద్ద ముద్దగా వినిపించి పాట ఆగిపోయింది. రెండవరోజు ఉదయాన్నే లేచి ఉత్తర దిశగా ఉన్నకిటికీలోంచి చూశాను. కిటికీకి నాలుగడుగుల దూరంలో ఉన్న రాతి కట్టు గోడ శిధిలావశేషంగా చాలావరకు పడిపోయి ఉంది. పెద్ద పెద్ద కంతల్లోంచి అవతలి ప్రపంచం చాలా వరకూ కనిపిస్తోంది. దూరాన పాత కాలపు జాగీర్దారీ సంప్రదాయంతో కట్టిన బంగళా ఒకటి సున్నానికీ, రంగులకూ నోచుకోక నీరుకావి రంగులో నిర్లక్ష్యంగా నిలుచుని ఉంది. దీపం పెట్టే దిక్కుకూడా లేనట్లూ, గత వైభవాన్ని నెమరు వేసుకుని నిట్టూరుస్తున్నట్లూ దైన్యంగా ఉంది.

ఆ బంగళాకూ, నా కిటికీ దగ్గర గోడకూ మధ్య రెండు వేపచెట్లూ, రెండు మావిచెట్లూ దట్టంగా చిక్కగా, పచ్చగా పెరిగి విప్పి నిలబెట్టిన గొడుగుల్లా కనపడ్డాయి. ఆచెట్ల కాండాలకు ఒక మనిషి ఎత్తు వరకూ కొమ్మలు కానీ, రెమ్మలుకానీ లేవు. నాలుగు స్తంభాలతో చతురస్రాకారంలో వేసిన ఒక చిక్కని పందిరిలాగా ఆ చెట్ల కొమ్మలు విస్తరించి కలుసుకొని చూడ ముచ్చటగా ఉన్నాయి.

ఆ పందిరికి కాసింత దూరంలో ఒక చిన్న పూరిపాక ఉంది. ఏడెనిమిదేళ్ల కుర్రాడొకడు

ఒక రాయి పట్టుకుని బాదం కాయ చితక్కొడుతున్నాడు. పక్కనే సింహంలాంటి ముసలి కుక్క తోక ఊపుతూ నిలుచుంది. ఇంటికి దక్షిణ దిశగా ఉన్న కిటికీలోంచి చూస్తే ఎండి బీటలువారిన పొలాలూ, వాటిలో రాళ్లు ఎక్కువగా పాతి సున్నం వేసిన గుర్తులూ కనిపిస్తున్నాయి. అలాంటి వాతావరణంలోకి నా భార్యను తెచ్చి నా కొత్త కాపురానికి నాంది పలికాను.

ఆదేసమయంలో విచిత్రమయిన రాజకీయ పరిణామం వచ్చిపడింది. ఒకే భాష మాట్లాడుకునే ప్రజలను ప్రాంతీయాభిమానం కారణంగా రెండుగా చీల్చే ఉద్యమం రేగింది. కొన్నాళ్లు ఉధృతంగా సాగింది. గోడమీద రాతలూ, పరస్పర దూషణలూ, అశాంతీ, అలజడి నగరాన్ని కుదిపాయి. ఒక మధ్యాహ్నం రెండు గంటలకు కర్ఫ్యూ పెట్టినట్లు తెలిసి సైకిల్ తొక్కుకుంటూ ఇంటి దిశగా పోతున్నాను.

ఒక అల్లరి మూక నా గోదావరి జిల్లా యాస విని రెండు చక్రాల టైరులకూ చిల్లులు పొడిచి విడిచిపెట్టారు. నయమే. అంతకన్నా హింసించలేదు. అవమానభారంతో రెండు గంటలు కొట్టేలోగా ఇల్లు చేరుకోవాలని త్వరగా సైకిలు నడిపించుకుంటూ వెళ్లే ప్రయత్నం చేస్తున్నాను. సైకిలు మొరాయిస్తోంది కదలకుండా. వెళ్లవలసిన దూరం ఎక్కువే ఉంది.

నాకు కాసింత దూరాన ఉన్న సైకిల్ రిక్షాను తొక్కుతున్న వాడు కాసేపు వింతగా చూసి "పయ్యల రెండింట గాలిపోయె గద దొరా. ఏడికి పొవ్వాలి?" అన్నాడు. బిక్కముఖంతో 'గుడిమల్కాపురం మసీదు దగ్గర" అన్నాను. ఎంతడుగుతాడో ఏమో? వద్దంటే ఈ సైకిల్ బరువును నేనే లాక్కుంటూ ట్యూబ్స్ పాడుచేసుకుంటూ పోవాలి అని తటపటాయిస్తున్నాను.

నా ఆలోచనల్ని చదువుకున్నట్లే "నీ మర్జీ కూసో" అని నన్ను తన రిక్షాలో కూర్చోబెట్టి నా సైకిల్‌ను ఎత్తి నాకు సుతారంగా అందించాడు. రిక్షా వేగం పుంజుకుని పోతూఉంటే ఏదో పాట అందుకున్నాడు. గొంతు శ్రావ్యంగా ఎక్కడో విన్నట్లే అనిపించింది. నేను చూపిన చోట రిక్షాను నిలిపి పగలబడి నవ్వాడు. "చందన్‌లాల్ ఇంట కిరాయి కొచ్చినవా? దొరా! నాకెరిక లేదు. ఈ పాటక్ ఎనకనే నేనుంట" అన్నాడు సైకిల్ కిందకు దింపుతూ.

ఐదురూపాయల నోటు చేతిలో పెట్టి నిలుచున్నాను. అందుకున్నాడు. రిక్షాలోని దిండుకింద కట్టె తీసి అందులోంచి రెండు రూపాయల నోటూ, ఒకరూపాయి నాణెం నా చేతిలో ఉంచాడు. ఆ దూరానికి అప్పట్లో రెండు రూపాయలు అందరూ అడిగే రిక్షా బాడుగే. నేను ఇదివరకు చూసిన సింహంలాంటి కుక్క ఎక్కడినుంచో వచ్చి తోక ఊపుతూ రిక్షావాడి కాళ్లు వాసన చూస్తోంది.

"దీన్ని జాగిర్దార్ చనిపోయినాక నా తాన ఇడిసిపెట్టి అతని కొడుకులు సిటీకి పోయిన్రు. ఇది నన్నిడవనంటది, దొరా!" అని నా ఇంటి పక్కనే ఉన్న గేటులోకి సైకిల్ రిక్షాను తీసుకుపోయాడు.

ఆ సాయంత్రంచీకట్లు ముసిరేవేళ వేపచెట్టు మీద కాకిరెక్కల చప్పుడు చేస్తూ అరుస్తూ ఉంటే మళ్లా శ్రావ్యంగా పాట వినిపించింది అదే గొంతు. అదే పల్లవి. అదే పాట.

మరుసటి వేకువనే పనిలోనికి వచ్చిన ఎల్లమ్మ గౌతమితో "నిన్న దొర మా రిచ్చల అచ్చిండంట గదా" అంటోంది. రిక్షా తొక్కిన మనిషి ముత్తయ్య అనీ, అతని భార్యే ఎల్లమ్మ అనీ, ఆకుపచ్చని చెట్ల నానుకుని వేసుకున్న చిన్న పూరిపాక వాళ్ల నివాసమనీ మెల్లమెల్లగా తెలిసింది. నా గది కిటికీ దగ్గర నిలబడి ఆ కోనలోకి తొంగి చూడడం, మాకు ఏ అవసరం వచ్చినా సహాయం కావలసి వచ్చినా ఎల్లమ్మనో, ముత్తయ్యనో కేక వెయ్యడం వేడుకగా, కాలక్షేపంగా, అలవాటుగా మారిపోయింది. పచ్చని ప్రకృతి ఒడిలో పసిపాపల్లా ఎల్లమ్మా, ముత్తయ్యా సంచరిస్తూ కనిపించేవారు. వాళ్ల పూరిగుడిసె కేవలం చలి బాధనుండి తట్టుకుందుకూ, వండుకున్న ఆహారం దాచుకుందుకూ మాత్రమే అక్కరకు వచ్చేది. వాళ్లమధ్య ప్రణయమైనా, ప్రళయమైనా ఆ నాలుగు చెట్లనీడలోనే. ఎనిమిదేళ్ల ప్రాయం ఉన్న ముత్తయ్య కొడుకు మా రెండుకుటుంబాలకూ వారధిగా తిరుగుతూ ఉండేవాడు.

ఒక సాయంత్రం కిటికీలోంచి చూస్తూ ఉంటే ముత్తయ్య నీడ కదలినట్లు అనిపించింది. మరునాడు ఉదయమే స్టేషన్ వెళ్లవలసిన అవసరం ఉండి "ముత్తయ్యా!" అని కేక వేశాను. జవాబు రాలేదు.

కాస్త ఆలస్యంగా ఎల్లమ్మ వచ్చి "లేదు దొరా!" అంది. ఉండి లేడని చెప్పవలసిన అగత్యం ఏమిటని ఆశ్చర్యపోయాను. పావుగంట కాలేదు. పాట వినిపించింది. అదే పాట. అదే దరువు. మొద్దుబారిన నాలుకతో పాడినట్లు పాటలో సాహిత్యం అంతా అలుక్కుపోయి వినిపిస్తోంది. మర్నాడు వాకిలి ఊడుస్తూ ఎల్లమ్మ నన్నుచూసి ఏదో సందేహిస్తూ - "నిన్న ముత్తయ్యని పిలిచినవులే దొరా! ముత్తయ్య లేననిచెప్పమన్నడు. దోస్తులింట షాదీకి పోయిన్డు. జర్ర తాగిండు. ఎక్కువ తక్కువ మాటలు నడుస్తయ్ అని బుగులు" అని లౌక్యంతెలియని వివరణ ఇచ్చింది.

అలా, అలా క్రమంగా ఆ పచ్చనిచెట్ల నీడలో ముత్తయ్య నాకు కాసింత అర్థమయినట్లనిపించాడు. అతన్ని ఒంటరితనం బాధించినట్లు ఎన్నడూ నాకు కనపడలేదు. అతని వెంట పాట ఉంటుంది. జానపదమో, తత్వమో పాడతాడు. తోచకుంటే ఊరికే ఉడుతతోనో, నోట ఎండుపుల్ల కరచుకుని గూడు కట్టుకుంటున్న కాకితోనో మాట్లాడగా విన్నాను. కేవలం పశువూ, పక్షికే పరిమితంకాలేదు ఆ స్నేహం. ఒకరోజు కిందికి వేలాడుతున్న మావి రెమ్మను చేత్తో సుతారంగా పైకి ఎత్తి కొమ్మలోకి గుచ్చుతూ 'మేక చూసెనా గుంజి గుంజి నంజుకుంటదే" అని హెచ్చరిస్తున్నాడు.

ఒకరోజు కొడుక్కు స్నానంచేయించి తల తుడుస్తోంది ఎల్లమ్మ. వెనకనేపోయి

ఎల్లమ్మకు గిలిగింతలు పెడుతున్నాడు ముత్తయ్య. అలాంటి సమయంలో మట్టినీ, చెమటనూ పూసుకొని తిరిగే సుగాత్రీ శాలీనుల్లాగా ఆ చెట్ల నీడలో కనిపించేవారు.

నేనూ, గౌతమి బంధువుల ఇంట పెళ్లికి వెళ్లి రెండురోజుల తర్వాత వచ్చాము. ముత్తయ్య పాట కానీ, ఎల్లమ్మ మాటకానీ వినబడలేదు.

"నలుగురు పోరలు మామిడాకుల కని వచ్చిన్రు. మస్తుగ కొమ్మలు కొమ్మలు కొట్టుకపోయిన్రు. ఆళ్లతో లొల్లి పెట్టుకున్నడు ముత్తయ్య. ఒక దొంగ పోరడు జబర్దస్తుగా నూకిండు. మొన్నటి సంది ముత్తయ్య దావకానల పడున్నడు" అని జరిగిన సంగతి చెప్పాడు పాలు పోసిన బాలయ్య.

అది విన్నాక నాలోఏదో అసంతృప్తి, ఏవో ఆలోచనలు. ముత్తయ్యను పదహారేళ్ల వయసులో చేరదీసిన జాగీర్దారు గతించిపోయాడు. జాగీర్దారు అవసరాలకుగానూ ముత్తయ్యకు కొనిపెట్టిన రిక్షా ముత్తయ్య కుటుంబానికి జీవనాధారం అయింది. జాగీర్దారు కొడుకులూ, కూతుళ్లూ ఇంటికి తాళాలు వేసి ఆస్తులకోసం కోర్టు చుట్టూ తిరుగుతూ పట్నవాసం చేస్తున్నారు. తనదికాని జాగాలో తన చేతుల్తో పెంచి పోషించిన పచ్చని చెట్లమీద మమకారం, వాటికి హాని కలిగితే ఓర్వలేని ప్రేమతత్వం నాకు అర్థంకాని చిక్కు ప్రశ్నలా కనిపించింది.

నాకొక వింత కోరిక కలిగింది. ఆఫీసుకు పోతూ దారిలో ఉన్న ఆసుపత్రికి వెళ్లి చూశాను. ముత్తయ్య చేతిని ఎత్తిపట్టి స్లింగ్ వేశారు.

నన్ను చూసి ఇది నిజమా అన్నట్లు ఆశ్చర్యంగా చూశాడు.

ఆ కళ్లల్లో ఏదో వెలుగు, మీసాల్లోంచి చిరునవ్వు. "నువ్వెప్పుడొచ్చినవు దొరా? రేపు సంది ఇంటికాడనే ఉంటగదా దొరా! ఫోటో తీసిన్రు. బుగులు పడొద్దన్నరు" అన్నాడు.

అప్పటికి కాస్త నాకు అలవడ్డ యాసతో "పోరలతో లొల్లి పెట్టుకున్న వెందుకు?" అన్నాను విచారిస్తూ.

"ఏంజెయ్యాల దొరా! బద్మాష్ ముండకొడుకులు రెండాకులు తెంపుకుంటమని జెప్పి కొమ్మలు కొమ్మలు కొట్టిపోయిన్రు. రుకాయించిన "ఈ చెట్టునీదా, ఈ జాగ నీదా" అని అడిగిన్రు.

"జాగ నాది కాకుంటే పాయె, ఆళ్లదైతే కాదుగదా. ఆ దొంగ కొడుకుల కంటె చెట్టు మీది కాకి నయమే. ఎందు పుల్లలు దెస్తది. గూడు కడ్తది. పిల్లలెగిరినాక గూడొదిలిపోద్ది. చెట్టుకి, కొమ్మకి నుక్సాన్ చెయ్యదుగదా. దాని గింజలు జల్లి పది చెట్లు మొలిపిస్తది" అన్నాడు ఆవేశంగా.

నేను ముత్తయ్యను శాంతపరచి దీనంగా చూస్తూ నిలుచున్న ఎల్లమ్మకు ధైర్యంచెప్పి ఆఫీసుకు పోయాను.

మా డిపార్ట్మెంటు క్వార్టర్స్ కట్టిన తరువాత నేను సిటీలోకి వెళ్ళిపోయాను. ఒకటిరెండుసార్లు రిక్షా తొక్కుతూ ముత్తయ్య నాకు కనిపించాడు. ఆగి "అమ్మ బాగుందా, నువ్వు బాగున్నావా? ఇల్లు సౌలతుందా?" అంటూ ఎన్నో ప్రశ్నలు వేశాడు. ఇంటికి వస్తానని కూడా అన్నాడు. కానీ, ఆ తరువాత నాకు ముత్తయ్య కానీ, ఎల్లమ్మకానీ తటస్థపడలేదు. ఒకమారు నేను ఆఫీసులో సహోద్యోగి పెళ్లికి గుడిమల్కాపురం మీదుగా వెళ్లాను. తిరిగి వస్తూ ఆగి కష్టంమీద ఇదివరలో అద్దెకున్న పెంకుటింటిని కనుక్కున్నాను. పరిసరాలన్నీ గుర్తు పట్టలేనంతగా మారిపోయాయి. తనని చేరదీసిన జాగీర్దారు భారీ శరీరాన్ని రిక్షాలో తిప్పుతూ ఆ నీడలో బతుకుతూ పోరడుగా ఉన్న వయసులో ముత్తయ్య వేసి పెంచిన పొదరిల్లు నాకెక్కడా కనపడలేదు. ఆ జాగాలో ఆకలితో రోడ్డును కూడా మింగాలన్నట్లుగా ఉరుకుతూ ఒక మేడ కనిపించింది. ముత్తయ్య ఏమైపోయాడన్న నా ప్రశ్నకు జవాబుచెప్పే పాతమొహాలు నాకెక్కడా కనపడలేదు. అలా ముత్తయ్య కోన జ్ఞాపకాలు క్రమంగా నా మనసులో మరుగునపడిపోతూ ఉన్నరోజుల్లో - అమ్మకుజబ్బు చేసినట్లు అన్నయ్య దగ్గరనుంచి టెలిగ్రామ్ వస్తే దూరప్రయాణమే చెయ్యవలసి వచ్చింది. అలిపూర్ ద్వార్ వెళ్లాను. స్టేషన్‌కు వచ్చిన అన్నయ్య అమ్మకు ప్రమాద పరిస్థితి తప్పిందనీ, ఏం భయంలేదనీ డాక్టర్ చెప్పారనీ నాకుచెప్పి నాలోని ఆరాటాన్ని సమాధానపరిచాడు. ఇంటికి తీసుకువెళ్లాడు.

అమ్మ నీరసంగా మంచంమీద ఉంది. నన్ను చూస్తూనే ప్రశ్నించింది. "గౌతమీ, మనవడూ బాగున్నారా? తీసుకు రాకపోయావా? అని-

వారంరోజుల తరవాత కాస్త కొత్తగా ఉన్న ఆ ప్రాంతంలో అటూ, ఇటూ తిరిగి రహదారి పొడుగునా కనిపిస్తున్న పనసచెట్లనూ, పచ్చగా పరచుకున్న తేయాకు తోటల్నీ చూస్తున్నాను.

ఒక సాయంత్రం స్టేషన్ దగ్గర పులి పిల్లలా మీసం సవరించుకుంటూ జీప్‌ని ఆనుకుని నిలుచున్న మనిషిని చూసి విస్తుపోయాను. సూర్యంకాడుగదా అనుకున్నాను. అయితే ఇంత పుష్టిగా ఉంటాడా? ఎందుకయినా మంచిదని గాలిలో బాణం విడిచినట్లు గట్టిగా "సూర్యం!" అని పిలిచాను. తక్షణమే తల నా దిశగా తిప్పి నిశితంగా చూశాడు.

కొన్ని క్షణాల తర్వాత ఆవేశంతో నన్ను కుదిపేస్తూ- "ఈ ప్రాంతంలో నన్ను సూర్యం అని పిలిచే వాళ్లెవ్వరూ లేరు. ఎన్నాళ్లకు కలిశాం" అని పొంగిపోయాడు.

అలా మాలోని ఆవేశాల ఒత్తిడి తగ్గి ఉపశమించాక "వస్తావా నాతో? ఇప్పుడు మన దేశంలో ఉన్న పెద్ద అడవుల్లో ఒకటైన మహారణ్యంలోకి పోదాం" అన్నాడు సూర్యం. "నీకూ, అడవికీ ఉన్న సంబంధం ఏమిటి?" అన్నట్లు చూశాను ఆశ్చర్యంగా.

"నా పోస్ట్ గ్రాడ్యుయేషన్ తర్వాత రెండుసార్లు కాంపిటేటివ్ పరీక్షలు రాసి చూశాను. రెండోసారి ఫారెస్ట్ సర్వీస్‌కు సెలక్షన్ వచ్చింది. అలా వచ్చి ఈ ప్రాంతంలో ప్రస్తుతం అసిస్టెంట్ కన్సర్వేటర్‌గా ఉన్నాను" అన్నాడు సూర్యం.

"ఎలాగైతేనేం. నీ అభిరుచికి తగిన ఉద్యోగమే సాధించావ్!" అని అభినందించాను

"కేవలం అభిరుచి ఏం చేస్తుంది? ఎన్నో ఆంక్షలూ, పరిమితులతో చలాయించాలి చేతిలో ఉన్న అధికారాన్ని. ఒక పక్క హేయమైన రాజకీయాలు, ఇంకోపక్క తోసిపుచ్చలేని రూల్సూ, రెగ్యులేషన్సూ- నిస్సహాయంగా చూస్తూ ఏమీ చెయ్యలేని పరిస్థితుల్లో కూరుకుపోయి పడే క్షోభ ఇంతా అంతా కాదు" అన్నాడు నవ్వుతూ.

పిలిచిందే తడవుగా సూర్యంతో కలిసి ఆ రాత్రి గడపడానికి నిశ్చయించుకున్నాను.

ఎత్తుగా అంతా కట్టెతో డిజైన్ చేసిన ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ చేరుకున్నాం. అక్కడకు చేరిన ఫారెస్ట్ సిబ్బంది అంతా ఇంకో రెండు జీపుల్లో సర్దుకున్నారు. ఒక జీపు మాకు ముందుగా వెళ్తూ వుంటే- ఇంకో జీపు మా వెనుక అనుసరించింది.

"దంతాలను అమ్ముకునే ఆశతో రాత్రులు ఏనుగుల్ని చంపే దొంగల ముఠా ఒకటి అడవుల్లో తిరుగుతున్నట్లు తెలిసింది. ఆ ముఠాకి అంతర్జాతీయంగా నడుస్తున్న ఇంకో పెద్ద ముఠాతో సంబంధం ఉందట. నిఘా ఏర్పాట్లు చెయ్యడం కోసం వెళ్తున్నాం" అని దారిలో మాటల సందర్భంగా చెప్పాడు సూర్యం.

రాత్రి కావస్తున్నా గుడ్డివెన్నెల్లో, విస్తరించిన అడవి వెలుపలి పరిధినుంచి కేంద్ర బిందువు వేపు దూసుకు పోతున్నాయి జీపులు. పైన విశాలంగా కనిపిస్తున్న ఆకాశం రానురానూ కుంచించుకుపోయినట్లు చిన్నగా కనిపిస్తోంది. ఎత్తుగా పెరిగి ఆకాశంలోకి దూసుకుపోతున్నట్లున్న చెట్లు చీకటి నీడల్ని మరింత చిక్కగా అడవిమీద కప్పివేస్తున్నాయి. చాలాసార్లు మెరుపువేగంతో రోడ్డును దాటుకుపోతూ జింకలు జీపులైట్ల వెలుగుల్లో కనిపించాయి. ఒకచోట పోవడానికి ఏమాత్రం అవకాశం లేకుండా అడ్డుగా నిలుచున్న ఏనుగుల జంటను చెదరగొట్టడానికి మా ముందు జీపులో వున్న వాళ్లు ఏవో పెద్ద శబ్దాలు చేసే పటాకీల్లాంటివి పేల్చారు. అలా అడవి మధ్యకు చేరుకున్నాక మేమంతా ఆగిపోయాం. అక్కడ ఒక దానిమీద ఇంకొకటిగా రెండు ఏనుగులు నిలిపినంత ఎత్తుగా ఒక మంచెలాంటిది దృఢంగా టేకు బల్లలతో దూలాలతో కట్టిఉంది. అది ఎక్కడానికి ఒక సన్నని నిచ్చెన అనుబంధంగా ఉంది.

ఫారెస్టు సిబ్బందితో సూర్యం ఏదో మాట్లాడుతూ ఉంటే నేను ఆ మంచె వేపు నిశితంగా చూస్తున్నాను. వాళ్లకర్థమయ్యే సంకేతాలతో ఏదో రేంజ్, సౌత్ బ్లాక్ కంపార్ట్‌మెంట్ 12 అని రాసి ఉంది. ఇద్దరు ఫారెస్టు గార్డులు సూర్యం దగ్గర ఉండిపోయారు. మిగిలిన వాళ్లంతా మూడు జట్లుగా విడిపోయి మూడు దిశలుగా వెళ్లిపోయారు.

"మనం కాలేజీలోచదివేరోజుల్లో నువ్వు స్పోర్ట్సమన్‌వి కదా! ఈ నిచ్చెన జాగ్రత్తగా ఎక్కు" అన్నాడు సూర్యం. నేను నెమ్మదిగా ఎక్కుతూఉంటే నా వెనుకనే వచ్చాడు.

అప్పటికే ఫారెస్ట్ గార్డులు మంచెమీద మేము కూర్చుందుకు అనువుగా జంబుఖానా పరిచి ఏర్పాటుచేశారు. ఎన్ని ముచ్చట్లు చెప్పుకున్నామో ఏమో, అలా మాటలాడుతూ ఉంటే కాలగమనమే మరచిపోయాం. మాట్లాడుతూనే అతను చెప్పినది విని "ఊ....." అంటూ

మగతగా నిద్రలోకి జారుకున్నాను. ఉషస్సు తూరుపు వాకిలినితెరిచే వేళకు కాసింత ముందుగా నన్ను మునివేళ్లతో ఎవరో తట్టి లేపినట్లనిపించి కళ్లు తెరిచాను. తన చూపుడు వేలు పెదవులమీద పెట్టుకుని మాట్లాడవద్దని నాకుసౌంజ్ఞతోసూచించాడు సూర్యం- నేను నిద్ర లేచి తనను అర్థంచేసుకున్నాక అతని చేతివేళ్లతో నా దృష్టిని ఒక పొద మాటుకు మళ్లించాడు.

నేను కళ్లు పెద్దవిచేసి ఉత్కంఠతో నిశితంగా అప్పుడే విరిగీ విరగని చీకట్లోకి చూస్తున్నాను.

ఒక పులి ఆత్రంగా జింకనో, దేన్నో చీల్చుకుని తింటోంది. ఆకలి చేస్తున్న తొందరంతా ఆ పులి ప్రతి కదలికలోనూ కనిపిస్తోంది. ఆకలి ఉపశమించాక తినడంలో ఆత్రం తగ్గి రుచిని ఆస్వాదించే స్థితికి దిగింది. తరువాత దాని పంజాను శాంతంగా నాలికతో నాకి శుభ్రం చేసుకునే సమయంలో ఒక వింత జరిగింది. అక్కడ పులి వున్న సంగతి తెలియకో, ఏదైనా ఇతర మృగం వెంట తరమడంవల్లో అటుగా రెండు దుప్పులు వచ్చి పులిని చూస్తూనే ప్రాణభయంతో మెరుపువేగంతో వేరే దిక్కుగా పరుగుతీశాయి. ఈ కలకలానికి విసుగ్గా పులి గాండ్రించింది. అడవి అంతా ప్రతిధ్వనించింది. అంతే! ఆ దుప్పుల జాడ లేదు. పులి అక్కడే ఉండి కదలకుండా భుక్తాయాసం తీర్చుకొని రాజసంతో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఎటో పోయింది.

అంతవరకూ నేను మాటా మంతీ లేకుండా ఆ పులినే చూస్తూ ఉన్నాను. "ఇంకేముంది? నీళ్లు తాగి ఎక్కడికో మరుగైన ప్రదేశంలో పోయి పడుకుంటుంది" అన్నాడు తెలతెలవారే వెలుగులో దూరంగా కనుమరుగవుతున్న పులిని నాకు చూపిస్తూ సూర్యం.

నేను అదే దిశగా చూస్తూ- "నాదొక సందేహం" అన్నాను మనసులోని విషయం బయటపెడుతూ.

'ఏమిటని?' అడిగినట్లే నావేపు చూశాడు.

"ఆ పులి సరిగ్గా దాని ముందుకే వచ్చి పరుగుతీసిన ఆ రెండు దుప్పుల్నీ చూసి వెంటపడలేదేం?" అడిగాను.

సూర్యం మొహాన చిరునవ్వు. "మనం క్రూరమృగాల్లో కూడా చూడగల హుందాతనం అదే! బుద్ధిజీవినని విర్రవీగే మనిషిలో ఉన్న పేరాశ మృగంలో కనబడదు. ఆ క్షణంలో పులికి ఆకలి తీరింది. కావలసినది విశ్రాంతి, ప్రశాంతి. అది భంగమైందని విసుగుతో గాండ్రించింది."

"శరీరంలో ఆకలి దహిస్తున్నప్పుడు అది వేటాడుతుంది. ఆ క్షణంలో జింకలోనో, దుప్పిలోనో దానికి ప్రకృతి నిర్దేశించిన ఆహారం కనిపిస్తుంది. ఇతర సమయాల్లో ప్రతి జీవిలోనూ అది చూసేది ఒక సహవాసినే. మళ్లీ ఆకలి రేగినప్పుడే అది వేట సాగి స్తుంది. ఇదే మనిషయితే ఆ రెండు దుప్పుల్నీ చంపి ఫ్రిజ్‌లో పెట్టుకుంటాడు."

ఇది విన్నాక "మనిషంటే నీకు చాలా నీరసమైన అభిప్రాయం ఉందే!" అన్నాను నవ్వుతూ.

"నే చెప్పింది చేదునిజమే. అడవిలో తిరిగి ఈ మృగాల్ని చూశాక నాకు రోజా కలిగే ఆలోచనలే ఇవి. ప్రకృతి ఒడిలో తల దాచుకుని పక్షులూ. పశువులూ ప్రకృతికి అనువుగా వాటి జీవితాన్ని మలుచుకుంటాయి. అలా సాధ్యంకాకపోతే వలసపోతాయి. అదీ సాధ్యం కాకపోతే అవే అంతరించిపోతాయి. అంతేకానీ ప్రకృతి మౌలిక స్వరూపాన్నే మార్చే ప్రయత్నం చెయ్యవు. కూర్చున్న కొమ్మను కొట్టుకునే వాడూ, వడ్డించిన విస్తరిని చింపుకు బతికేవాడూ,గాలిలో, నీటిలో విషం కలుపుకునేవాడూ ఈ బుద్ధిజీవే! రెండు చెట్లు పెంచలేని వాడు అడవిని కొట్టి అమ్ముకుంటాడు. దంతాలకోసం ఏనుగు గున్నల్ని కూడా బతకనివ్వడంలేదు. ఇంతెందుకూ ఆఫ్రికా అడవుల్లో సింహాలతోకూడా సహజీవనం చేస్తూ ఇన్ని తరాలుగా బతకగలిగిన ఏనుగులు మనిషి ఆశకు బలైపోతున్నాయి. ఇలా సాగితే పదిహేను ఇరవై ఏళ్లలో అసలు భూమ్మీంచి ఏనుగులే అంతరించిపోతాయని భయపడుతున్నారు. ఆవులూ, గేదెలూ గడ్డిని కొరికి తింటాయి కానీ, వేళ్లతో పెరికి తినవు"

విచిత్రమైన ఆవేశానికి లోనైపోయినట్లు సూర్యం పెద్ద ఉపన్యాసమే ఇచ్చాడు.

ఇంతలో రాత్రి గస్తీకిపోయిన సిబ్బంది వచ్చి సూర్యంతో ఏవో చర్చించుకున్నాక మూడు జీపులూ తిరుగు ముఖం పట్టాయి.

ఆ ఉదయం నేను **సూర్యం** ఇంటి అతిథిని. అతని భార్యకూ, పిల్లలకూ నన్ను పరిచయం చేశాడు.

నేనూ, సూర్యం చిన్నతనంలో స్కూల్లోతీయించుకున్నఫోటో ఒకటి నాకు చూపాలనే ప్రయత్నంలో ఏవో కాగితాలు వెతుకుతూ ఉంటే అందులో ఉన్న ఒక చిన్న ఫైల్ మీద నా దృష్టి పడింది.

అందులో ఎన్నో అరుదైన వార్తలూ, ఫోటోలూ, న్యూస్‌పేపర్లలోంచి కత్తిరించిన సమాచారాలూ శ్రద్ధగా అంటించాడు సూర్యం. ఒక చింపాంజీ గడ్డి పరకలు చేత్తో పట్టుకుని మేకకు తినమని అందిస్తోంది. ఒక కోడిపెట్ట రెండు చిన్న పిల్లి కూనల్ని దాని రెక్కలమాటున ప్రేమగా కప్పి సాకుతోంది. ఒక పంది తన కూనలతోపాటు ఒక కుక్కపిల్లకు కూడా పాలు కుడుపుతోంది. అలాంటి అరుదైన ఫోటోలు చాలా ఆ ఫైల్‌లో సేకరించాడు. అందులో కొన్ని విచిత్రాలు నేను ఇదివరలో ఏవో న్యూస్ మాగజైన్‌లోనో, పేపర్లోనో చదివిన జ్ఞాపకం ఉంది. కానీ ఇంత శ్రద్ధగా కత్తిరించి గౌరవించలేదు.

అమ్మకు ఒంట్లో నెమ్మదిగా ఉంది. సెలవు గడువుకూడా పూర్తి అవడంతో తిరుగు ప్రయాణం చేస్తున్నాను. రైల్లో పై బెర్తుమీద పడుకున్నాను. నిద్రరావడం లేదు. పలాసా రోడ్ దాటినట్లున్నాము. ఎవరో ఇద్దరు వయసు మళ్లిన వాళ్లు తెలుగులో ఊరికే

మాట్లాడుకుంటున్నారు. భక్తిమార్గం, జ్ఞానమార్గం అంటూ ఏదో తాత్త్విక పరిధిలో ఉంది వాళ్ల చర్చ- అది వినక తప్పడంలేదు. అలాగని అర్థంకూడా కావడంలేదు. సూర్యం ఎంత నిగర్వి అనుకుంటూ నా ఆలోచనలు అతనిమీదకు మళ్లించాను. అల్ట్రా వయొలెట్ కిరణాలు, క్లోరోఫోరో కార్బన్ మూలకాలు, ఏసిడ్ వానలు, ఓజోన్ పొరకు చిల్లులు అంటూ ఏవేవో విషయాలు చెపుతూ ఆవేదన పడుతూ వచ్చాడు- అతనితో నేను గడిపిన సమయాల్లో.అవేవీ నాకంత బాగా అర్థమై చావలేదు. కానీ పచ్చని ప్రకృతి మౌలిక రూపాన్నే మార్చిపారేస్తున్న మానవుడు తనకు ముప్పు తెచ్చుకోవడమే కాదు, ఏ పాపం ఎరక్కుండా సుఖంగా బతికే పశువులకూ, పక్షులకూ ఎసరు పెడుతున్నాడన్న మాటలు నా చెవిలో రొద చేస్తున్నాయి.

హైదరాబాద్ వచ్చి ఒకసాయంత్రం పబ్లిక్ గార్డెన్ గేటు ముందునుంచి నడిచిపోతున్నాను. 'సెమినార్' జరుగుతున్నట్లు ముఖద్వారం దగ్గర ఒక బానర్ కట్టారు.

అది చదువుతూ ఉంటే సరిగ్గా నా దారికి అడ్డుగా నిలబడ్డాడు ఎవరో. మంచిబట్టలు వేసుకున్నాడు. నవ్వుతున్నాడు. "బాగున్నావా, దొరా!" అని తన గొంతు వినిపించకుండా ఉంటే ముత్తయ్యను నేను గుర్తించడం కష్టమే అయ్యేది. మనిషి కాస్త నీరసించాడు. కానీ అదే చిరునవ్వు, కళ్లల్లో అదే వెలుగూ.

"బాగున్నావా, ముత్తయ్యా ఎల్లమ్మ బాగుందా'' అని అడిగాను.

"మంచిగున్నది, దొరా! ఎల్లమ్మ మంచిగుంది. అమ్మని దినాం యాదిచేస్తది. నేను బీమార్ అయినాక రిచ్చా తొక్కుడు బంద్ చేసినా. నా కొడుక్కు గీడనే సర్కార్ కొలువు దొరికింది. నన్నూ, ఎల్లమ్మనూ మంచిగా జూచుకుంటరు నా కొడుకూ, కోడలూ' అన్నాడు సంతృప్తిగా.

అలా అంటూనే ఏదోచెప్పాలని గొంతు సవరించుకుంటున్నట్లు తోచింది. నిదానించి వింటున్నాను.

"మేం చిన్నపోరలం. ఎండకాలంలో మా తాతఎంబడి గీడకొచ్చి ఆడుకునే టోలం. నీలుతాగి పండేటోలం. మీరంత పబ్లిక్ గారటన్ అంటరులే. మా జమానాల బాగయాం (బాగ్- ఏ ఆమ్) అనేటోలం. గీడున్న జాడ్‌పేడ్ దునియాల లేకుండే. రైలుకట్టవార కూసింత పాయె. రోడ్డు వార కూసింత పాయె. ఏడ జూసిన సీకులు, సిమ్మెంటు. బాగియాంల బిల్డింగులె మొలిపిస్తున్రు జాడుమల్ల..." అని నిట్టూర్చాడు.

ఆ నిట్టూర్పులో సూర్యం ఆవేదనంతా వినిపించింది నాకు. ఇదో వింత ప్రేమతత్త్వ. ఇద్దరూ ఇద్దరే. ఈ కాలం మనుష్యులు వీళ్లకు అర్థంకారు. వీళ్లు మనకు అర్థమైతే కదా!

(ఆంధ్రప్రభ వారపత్రిక ఫిబ్రవరి 12-18, 1992)